# ఆత్మ చెప్పిన సత్యం

'మొన్న పండక్కి కుట్టించిన షర్టు ఎక్కడుంది?'

'చూడండి...బీరువాలోనే వుంది.' 'నాకు టైమవుతోంది'

'నాకూ టైమవుతోంది...ఇవ్వాళ్ల నాకు ఫస్టవర్ క్లాసుంది.'

హైదరాబాదు నుంచి యివ్వాళ్ల మా ఆఫీసుకి అక్కౌంట్స్ చెక్ చేసేందుకు డైరెక్టరుగారొస్తున్నారు...'

'అయితే నన్నేం చెయ్యమంటారు...'ఆమె మాటలో విసుగు తొంగి చూసింది.

'అలా విసుక్కునే బదులు ఆ షర్టు ఎక్కడుందో చెప్పరాదు...' చిరాకుపడుతూ అన్నాడు.

'చిరాకు పడుతూను చిందులుతొక్కుతూను వెతికితే, కంటిముందున్న వస్తువు కూడా కనిపించదు...'

'నాక్కూడా సైకాలజీ పాఠం చెపుతున్నావన్నమాట!' అతను తోకతొక్కిన పాములా కనిపించాడు.

'ఆ సైకాలజీ పాఠాలే నండీ నాకు నెలకు సుమారు పదివేలు పువ్వుల్లో పెట్టి యిస్తున్నాయండి...అందువల్ల మనం ఎన్ని ఆటలైనా ఆడగలుగుతున్నాం...'

'శ్వేతా...'

నేను భర్తననే అధికారం ఆ గొంతులో ధ్వనించింది.

'ఎందుకలా గొంతుచించుకుంటారు?'

తంజావూరు బొమ్మలా తల ఆడించే బొమ్మను తాను కాననీ, డాక్టరేటు పొందిన భార్యననీ ఆమె గొంతు స్పష్టం చేసింది.

లోకజ్ఞానం లేని చదువులు ఎవడిక్కావాలని...' అతని పురుషాధిక్యం బుసలు కొట్టింది.

'అవున్లెండి...మార్చి, సెప్టెంబరంటూ డిగ్రీ తెచ్చుకున్నవారికి చదువుల గొప్పతనం ఏం తెలుస్తుంది...' ఆమె వెటకారం కోపం పరాకాష్ట నందుకున్నాయి.

ఎలుక పిల్లి లాంటి ఆ భార్యాభర్తల కొడుకూ కోడలి- మాటలు వినలేక వంటింట్లోంచి ఆవిడ గది గుమ్మందాకా వచ్చి అక్కడే దిష్టిబొమ్మలా నిలుచుండిపోయింది.

భార్యాభర్తల వాగ్యుద్ధం శ్రుతిమించిరాగాన పడింది. ఆవిడ సహించలేకపోయింది.

'చిన్న విషయానికి ఎందుకర్రా అలా నోరు పారేసుకుంటారు.'

'నేనేమన్నా అంటే చాలు, మీ తల్లీకొడుకులకు నోరు పారేసుకున్నట్టుగా కనిపిస్తుంది...అంతా నా ఖర్మ...'

కోడలు ముఖారిరాగం అందుకునేసరికి అత్తగారు 'ఇప్పుడు నిన్ను ఏమన్నానమ్మా' అంది అనునయిస్తూ.

'ఏమీ అనలేదు...నా మాటలే మీ ఇద్దరికీ వినిపిస్తాయి...'

'అయిందానికి కాని దానికి ఎందుకురా అలా సాధిస్తావు? కాలేజీకి తొందరగా వెళ్లాలన్న హడావిడిలో ఏదో అందనుకో...ఆ మాత్రానికి ఇంత రాద్ధాంతం చెయ్యాలా...'

తల్లిమాటలు చెవినిపడేసరికి ఆజ్యం పోసిన అగ్నిలా కొడుకు భగ్గుమని లేచాడు.

'అంతా కలిసి నన్నే అనండి...నేనేగా మీ ఇద్దరికీ లోకువ. చదువు తక్కువ. జీతం తక్కువ. అందం తక్కువ...'

'అవేం మాటలండీ...వింటే ఆ పసివాళ్ళు కూడా నవ్వుతారు...' స్కూలుకి బయలుదేరిన యిద్దరు పిల్లలకి వాటర్ బ్యాగులు అందిస్తూ ఆమె అంది. ఏ కళనుందో కాని, ఆమె కోపతాపాలు తెరమరుగుకి చేరుకుంటున్నాయి.

గోడగడియారం తొమ్మిదిసార్లు హెచ్చరించింది.

'టైమయింది...' భార్యభర్తలు ఏకకాలంలో అన్నారు. తదుపరి కార్యక్రమంలో మునిగి పోయారు. నిర్ణీత సమయంలో బయలుదేరాలనే తహతహ కొద్దీ. స్కూటరు మీద భార్యను కాలేజీ వద్ద దింపి... తాను ఆఫీసుకి వెళ్ళడం అతని అలవాటు.

వాళ్లలా తమ పనుల్లోకి మరలడం చూసి ఆవిడ 'అమ్మయ్యా' అనుకుని వంటింటికి దారితీసింది.

ఆ రాత్రి భోజనాల దగ్గర ప్రొద్దుటి విషయాలు ప్రస్తావనకు వచ్చేసరికి ఆవిడ మనసుని నల్లమబ్బులు కమ్ముకున్నాయి. మళ్లీ జడివాన కురుస్తుందేమోనని భయపడింది. దాంతో ముఖం వివర్ణమయింది.

పచ్చడి కలుపుకుంటూ, 'త్వరలోనే నాకు ప్రమోషనొస్తుందని మా డైరెక్టరుగారన్నారు' అన్నాడు కొడుకు ఉత్సాహంగా.

'అయితే జీతం కూడా పెరుగుతుందన్నమాట...'

'తప్పకుండా పెరుగుతుందత్తయ్య గారూ...'

'ఎంత పెరిగినా, నీ జీతం కంటె తక్కువేగా...'

'నా జీతం మాత్రం మీది కాదా?'

'మంచిమాట అన్నావమ్మా...కాపురం చేస్తూ నీది నాది యేమిట్రా..ఆ మాటలూ నువ్వూను..' తల్లి మందలించింది.

'మొదట్నుంచీ కోడల్ని వెనకేసుకురావడం నీకు కొత్తకాదుగా...' భోజనం ముగించుకుని కొడుకు వెంటనే తన గదిలోనికి వెళ్లిపోయాడు.

కోడలు మౌనం వహించక తప్పలేదు. వంటింటి పనులు యంత్రంలా పూర్తిచేసి, ఆమె కూడా గదిలోకి వెళ్లిపోయింది.

కొడుక్కి తన మీద యింకా కోపం తగ్గనందుకు తల్లి బాధపడింది. ఆ రాత్రి ఆవిడకి కునుకు పట్టలేదు, ఎంత ప్రయత్నించినా. లేచి కూర్చుంది. ఆవిడలో అంతర్మథనం ప్రారంభమయింది.

....ఇంతకూ నేను చేసిన తప్పేమిటి? కొడుక్కి తన మీద యింతకోపం రావటడానికి కారణమేమిటి? చదువుకున్న కోడలు కనకవస్తే

పెద్దచదువు, పెద్ద ఉద్యోగం లేని కొడుకు సంపాదనకి చన్నీళ్ళకి వేణ్ణీళ్ల తోడయినట్టుగా వుంటుందనుకున్నాను. సంబంధాలెన్ని వచ్చినా, అవీ కాకుండా చేశాను. ఒకటి రెండు వాడికి నచ్చినా, ఎందుకని? చదువుకున్న కోడలు కావాలని, చివరికి కాణీ కట్నం తీసుకోకుండా శ్వేతను ఖాయపరిచాను. మొదట్లో వాడు ఒప్పుకోలేదు. న్యూనతగా భావించిన మాట నిజమే.. కోడలి కంటే తాను చదువుసంధ్యలలో అందచందాలలో తక్కువ వాణ్ణి అన్నాడు. సంతానం కలిగిన తర్వాత ఆ భావాలన్నీ మాయమవు తాయని ఒప్పించవలసి వచ్చింది...అలా చేసి తప్పు చేశానా? చేసినా వాడి మంచికోసమే గదా...ఎంత సరిపెట్టుకోవాలనుకున్నా ఆవిడ అలా చెయ్యలేకపోయింది తప్పుచేసిన దానిలా అనుకుంది...

పడుకుందన్న మాటేగాకని, శ్వేతకు నిద్రపడితే ఒట్టు. రకరకాల తలపులు రాకపోకలు చెయ్యసాగాయి... సైకాలజీ చదువుకున్నా నా భర్త మనస్సుని నేనెందుకు సరిగా అర్థం చేసుకోలేకపోతున్నాను? చీటికి మాటికి చిన్న చిన్న విషయాలలో ఎందుకు గొడవలు పెట్టుకుంటున్నాను. వాటివల్ల లాభమేమిటి? చదువుకి తగ్గ సంస్కారం నాలో లోపించిందా?...

ఉన్నట్టుండి ఒక్కసారి భర్తను చూసింది.

'నిద్ర రాలేదా?'

బదులు రాలేదు.

'పొద్దున నేనన్న మాటలకి మీరు బాధ పడుతున్నారా? అనాలని అనలేదండి...'

'నువ్వేమన్నావని? ఉన్న విషయమే చెప్పావు...' అన్నాడు భర్త. లేచి కూర్చుని 'నేనే ఎక్కువ సంపాదిస్తున్నానని నువ్వనుకోవడంలో తప్పేముంది?' ఎదురు ప్రశ్న వేశాడు.

భర్త ఒడిలో ఆమె తలదాచుకుంది.

'నేను తెచ్చే జీతం రాళ్లతో సంసారం గడుస్తున్నా, నీ సంపాదన వల్లే మనం పిల్లల్ని కాన్వెంటులో చేర్చగలిగాం.. కలర్ టి.వి., ఫ్రిజ్, గ్రైండర్... అన్నీ కొనుక్కోగలిగాం.. హుందాగా జీవించగలుగుతున్నాం. తక్కువ జీతగాడు జీవిత సౌఖ్యాలు ఎలా అనుభవించగలుగుతున్నాడని...'

ఉలిక్కి పడిన వానిలా 'ఏడుస్తున్నావా శ్వేతా' అడిగాడు ఆదుర్దాగా. అతని జుబ్బా మీద ఆమె తలపెట్టుకుని పడుకున్న భాగం తడిసి పోయింది; తాకి చూస్తే కొంచెం వెచ్చగా వుంది అతని గుండె బరువెక్కింది. 'శ్వేతా, యేడుస్తున్నావా?' మళ్ళీ అడిగాడు.

'మీ మంచి మనస్సుని అర్థం చేసుకోలేకపోయానండీ. చదివిన చదువుని సరిగా వినియోగించుకోలేకపోతున్నాను...'

'నువ్వు సైకాలజీ బాగా చెపుతావన్న సంగతి మా ఆఫీసుదాకా పాకిందంటే నమ్ము...'

'కావచ్చు. కాని కట్టుకున్న భర్తనే అర్థం చేసుకోలేనప్పుడు నా చదువు వ్యర్థమైనట్టేగదా...'

'అబ్బే...అదేం మాట! కష్టపడి చదివిన చదువు, ఆర్జించిన విజ్ఞానం ఎప్పుడూ వ్యర్థం కావు. నీ చదువుని ఎగతాళి చేసినందుకు విచారిస్తున్నాను...'

'నాలో అహంకారం చావనందుకు సిగ్గు పడుతున్నాను. అందువల్లనే అప్పుడప్పుడు మనం గొడవపడుతున్నాం...'

'గొడవలకి కారణం నువ్వొక్కదానివే కాదు... రెండు చేతులు కలిస్తేనే...'

ఇలా ఎంతసేపు తెలియచేసుకున్నారో ఒకరి తప్పులు మరొకరు! ఎంతసేపు సాగిందో ఆత్మపరీక్ష!

శ్వేత లేచేసరికి వంటింట్లో దీపం వెలుగుతోంది. భర్త నిద్రలోనే వున్నాడు. పిల్లలూ అంతే.

కాలకృత్యాలు తీర్చుకుని, ఆమె వీధి ఊడ్చి కల్లాపి చల్లి ముగ్గుపెట్టి వీధి తలుపు వేసి లోపలికి వచ్చింది. కూరలు తరుగుతున్న అత్తగారికి సాయంగా కూరలపళ్లెం ముందుకు లాక్కుంది.

'కాఫీ తాగమ్మా. తర్వాత చేద్దువుగాని...

కాఫీ తాగుతుంటే వీధి తలుపుకొట్టినచప్పుడయింది. ఇంత పొద్దున్నే ఎవరొచ్చారా అనుకుంటూ శ్వేత తలుపు తీసింది.

'నమస్కారమండి'

'రండి రామారావుగారు...లోపలికి రండి. ఏమిటి ఇలా వచ్చారు?...'

'మా మరదలు వాళ్లు నిన్న రాత్రి వచ్చారు.. మొన్నేమో మా తమ్ముడూ వాళ్లు. ఖర్చుమీద ఖర్చువచ్చిపడుతుంటే, జీతం సరిపోవడం లేదంటే నమ్మండి...'

'అవుననుకోండి... శ్యామలగారు చాలా జాగ్రత్త మనిషి...'

'బి.ఏ. చదువుకుంది.. ఏం లాభం...ఉద్యోగం చేస్తే...'

'ఇంకా ఏ చేస్తారండి ఆవిడ? ముగ్గురు పిల్లల్ని చూసుకుంటు న్నారు... ముసలి మామగారికీ మీకూ వేళకుపాళకు అన్నీ అమర్చి పెడుతున్నారు...'

'నిజమే...అయినా ఏదో ఒక చిన్న ఉద్యోగం చేస్తే...'

'రామారావుగారు, అంటున్నానని కోపం తెచ్చుకోకండి. ఫిజిక్సులో మీరు ఎంత గొప్పవారో, ఇంటిని చక్కబెట్టుకుంటూ గుట్టుగా కాపురం చెయ్యడంలో ఆవిడ అంత ఘటికులు. మా అత్తగారు ఇంటి పనులన్నీ చూసుకుంటారు. మా వారు బయటి పనులు.

...కనక నేను నిశ్చింతగా ఉద్యోగం చెయ్యగలుగుతున్నా. పరిస్థితులను కూలించాలిగదండీ...'

'మీరు చెప్పినట్టు పరిస్థితులు కలిసిరావాలి. అయినా చదువుకున్నందుకు ఉద్యోగం చేస్తే అవసరానికి ఉపయోగపడుతుంది గదండీ డబ్బు...'

'మీ కెందుకో అసంతృప్తి కలిగింది కానీండి, మీరొకలా కష్టపడుతుంటే ఆవిడ మరోలా కష్టపడుతున్నారు. తనని తాను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే, ఎదుటివారి సమస్యలూ అవీ సులభంగా అర్థమవుతాయి.'

'మీరు వేదాంతంలోకి దిగుతున్నారు...'

'వేదాంతం కాదు...జీవిత సత్యం...మనల్ని మనం పరీక్ష చేసుకుంటూ వుండాలి...' శ్వేత కొంచె ఆవేశంగానే చెప్పింది.

అప్పుడే అక్కడికి వచ్చిన ఆమె భర్త 'మీ మాటలకు నేను అడ్డుతగలడం లేదుగా...' అన్నాడు.

'మా వారిని మీ రెప్పుడూ చూడలేదనుకుంటాను...'

'నమస్కారమండి..'

శ్వేత నవ్వుతూ సగర్వంగా చెప్పింది. 'చదివింది గణితశాస్త్రమేకాని ఆత్మవిచారం ఆయనకి అభిమాన విషయం...

'అయితే మీ ఇంట్లో సమస్యలూ అవీ లేవనుకోవచ్చు..' నవ్వుతూ రామారావు అన్నాడు.

'చదివింది చేతల్లోకి మారనంతవరకు సమస్యలుంటాయి గదండీ.,..'

'మా వారు చెప్పింది కరెక్ట్. కనకనే ప్రతి విషయంలోను ఆత్మపరిశీలన అవసరమవుతోంది. సమస్యల్ని తగ్గించుకునేందుకు ప్రయత్నించడం మంచింది..'

రామారావులో అసహనం కనిపించేసరికి, 'ఇంతకూ మీరొచ్చిన కారణం కనుక్కోవడం మరిచిపోయాను. ఐ యామ్‌సారీ...' అంది శ్వేత.

ఆయన కారణం చెప్పాడు. అది ఆమె నెరవేర్చింది. సెలవు తీసుకుని ఆయన వెళ్లిపోయాడు.

'శ్వేతా, ఆయనెవరో పరిచయం చెయ్యలేదు.'

'మీకు తెలుసునని చెయ్యలేదు...సారీ...

మా కాలేజీలో ఫిజిక్సు రీడర్. ఆయన పాఠం వింటే, ఎలాంటి మొద్దయినా న్యూటన్ భక్తుడవుతాడు...'

'ఆయన్ని చూస్తుంటే సమస్యలేవో వున్నవాడిలా కనిపిస్తునారు...'

'మీరూహించింది నిజమే. చదువుకున్న తన భార్య ఉద్యోగం చేయడంలేదని ఆయన అసంతృప్తి. అంతేకాని పరిస్థితుల్ని అర్ధం చేసుకోవడానికి ఆయన ప్రయత్నించరు...'

వాళ్లిద్దరూ తమ పనుల్లో మునిగిపోయారు. టైం కావడంతో ఎవరి ఉద్యోగాలకు వారు బయలు దేరారు. స్కూటర్ ఎక్కుతూ తృప్తిగా అనుకున్నాడు శ్వేత భర్త...' 'మా అమ్మ ఏం చేసినా నా మంచి కోరే చేస్తుంది... అత్మ చెపుతున్న సత్యం...'